
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్12ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశ యానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 101క్యూ సెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 39.055 టిఎం సిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350 , ఎస్ఎఫ్‌సికి 300 , పెన్నా డెల్టాకు 3850, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 93.933మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## విమాన ప్రమాదం పై వేమిరెడ్డి దంపతుల దిగ్భ్రాంతి



**నెల్లూరు రూరల్, జూన్ 12, ప్రభాతవార్త** గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ లోని మేఘా ని నగర్ లోని తీరి మెడికల్ కాలేజీ మెస్ పై విమానం కూలడంతో విమానంలోని ప్రయాణికులతో పాటు మెస్‌లోన మెడికోలు మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింద న్నారు. 242 మంది తమ ప్రాణాలు కోల్పోవడం కలచి వేసిందని చెప్పారు. ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబాలకు అండగా ఉంటాయని వెల్లడించారు, అదే విధంగా క్షతగాత్రులకి వెంటనే సరైన వైద్య సదుపాయం అందాలని కోరారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆ బాధిత కుటుంబాలకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.

## అహ్మదాబాద్‌లో జరిగిన
### ఘోర విమాన ప్రమాదం బాధాకరం



**నెల్లూరు, జూన్ 12, ప్రభాతవార్త-వైద్యం** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయినవారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. దుర్ఘటనలో పలువురు ప్రయాణికులు,అలాగే వైద్య విద్యార్థులు మృతిచెందడం హృదయ విదారకరం అన్నారు. బాధితులకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కోరుతున్నానన్నారు.

## 14 న జిల్లాలో 7184 చోట్ల యోగా ప్రదర్శనలు
### - ఇన్‌ఛార్జీ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 12, ప్రభాతవార్త** జిల్లాలో గుర్తించిన 7184 ప్రదేశాలలో ఈ నెల 14న యోగా ప్రదర్శనలు (డెమోని స్ట్రేషన్) నిర్వహించాలని ఇన్‌ఛార్జీ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ అధికా రులకు సూచించారు. గురువారం ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్21న జరిగే అంతర్జాతీయ యోగాదినోత్సవానికి ముందస్తు సన్నాహకంగా 14వతేదీన అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన అన్ని స్థలాల్లో స్థానిక ప్రజలను బాగ స్వాములను చేసి యోగా ప్రదర్శనలు చేయాలన్నారు. ప్రదర్శన ఫోటోలను యోగా వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు.

**- 13న యోగా పై పాటల పోటీలు** ఈ నెల 13న నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు యోగాపై పాటల పోటీలు నిర్వహించడం జరుగు తుందని, ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు ఈ పోటీలలో పాల్గోవచ్చని, పాటలు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలలో పాడవచ్చన్నారు.జిల్లా స్థాయిలో గెలుపొందినవారు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొన వచ్చని, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి లక్ష రూపాయల నగదు బహుమతి ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

## డ్రైన్ కాలువలు, సిసి రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయండి : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 12 ప్రభాతవార్త:** నగరవ్యాప్తంగా అవసరమైన అన్ని ప్రాంతాలలో డ్రైను కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీ ప్రాంతంలో కమిషనర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా సిసి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణ ఆవశ్యకతను ప్రజలు కమిషనర్ కు ప్రత్యక్షంగా విన్నవించారు. స్పందించిన కమిషనర్ వెంటనే ఇంజనీరింగ్ సివిల్ వర్క్స్ నిర్మాణాలకు అవసరమైన అన్ని ప్రణాళికలను అధికారులు అందరూ సమన్వయం చేసుకొని సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ ప్రాంతంలో కమిషనర్ పర్యటించి డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించి ప్రజలంతా సహకరించాలని సూచించారు. స్థానిక వనంతోపు ప్రాంతంలో జరుగుతున్న డీసిల్టేషన్ పనులను కమిషనర్ తనిఖీ చేసి సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా పొందిన అనుమతుల మేరకే భవన నిర్మాణాలను చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం వి.ఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. నిర్మాణ అభివృద్ధి పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల్ని కాపాడిన ఎమ్మెల్యే
### ఎమ్మెల్యే ఆదేశాలతో హుటాహుటిన పరుగులుతీసిన విద్యుత్‌శాఖ



**కావలి, జూన్12 ప్రభాతవార్త** ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల్ని కాపాడడమే లక్ష్యంగా పెట్టుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేసిన సాహసోపేతమైన చర్య అందరి ప్రశంసలు అందుకుంది. ఎమ్మెల్యే ఫోన్ ఆదేశాలతో విద్యుత్‌శాఖ హుటాహుటిన పరుగులు తీసిన వైనమిది. వివరాలు ఇలా ఉన్నాయి. కావలి మండలం ఆముదాలదిన్నెవద్ద అకస్మాత్తుగా విద్యుత్ తీగలు రోడ్డుపైన పడ్డాయి. గమనించిన ఎమ్మెల్యే దగుమాటి కారు ఆపి కిందకు దిగారు. ప్రజలు ఈ విద్యుత్ తీగలకు చిక్కుకుంటారన్న భయంతో ఆయన స్వహస్తాలతో రోడ్డుకు అడ్డంగా పడిఉన్న విద్యుత్ తీగలను పక్కకు నెట్టారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేశారు. రోడ్డుమీద విద్యుత్ తీగలు పడిఉన్నాయని, ఈ తీగలు షాక్ కొట్టే ప్రమాదముందని వెంటనే ఈ తీగలను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. హుటాహుటిన విద్యుత్‌శాఖ బృందం అక్కడికి చేరుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయించారు. విద్యుత్ తీగలు రోడ్డుపైన అడ్డంగా పడిఉన్న దృశ్యాన్ని ఆయన ఫోన్‌లో చిత్రీకరించి విద్యుత్‌శాఖ అధికారులకు పంపారు. వెంకటేశ్వరపురంలో అభివృద్ధి కార్యక్రమాలు ముగించుకుని ఎమ్మెల్యే కావలికి వస్తుండగా విద్యుత్ తీగలు రోడ్డుకు అడ్డంగా పడిఉండడాన్ని గమనించారు. సమయస్ఫూర్తితో ప్రజలకు ఆటంకం కలగకుండా తీగలను పక్కకు లాగేశారు. ఎమ్మెల్యే గమనించకపోతే ఘోరప్రమాదం సంభవించేదన్న ప్రచారం సాగింది. ప్రమాదాన్ని ముందుచూపుతో అరికట్టిన ఎమ్మెల్యే దగుమాటిని ప్రజలు అభినందనలతో ముంచెత్తడం చెప్పుకోదగ్గ విశేషం.



## వాడి వేడిగా జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

- ఆత్మకూరులో బ్రిటీష్ కాలం నాటి భవనం ఎలా పడగొడతారు
- చింతా రెడ్డెం పాలెంలోని అంగన్వాడి భవనం నిర్మాణ పనులు సంగతి ఏంటి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులపై ధ్వజమెత్తిన జెడ్పీ చైర్ పర్సన్ అనం అరుణమ్మ



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 12, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పి సీఈవో మోహన్ రావు ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడు స్థాయి సంఘ సమావేశాల్లో జడ్పిటిసి సభ్యులు ఆయ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొని సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం అందించారు మొదటగా గ్రామీణ నీటి సరఫరా,పారిశుద్ధశాఖతో సమావేశం నిర్వహించగా సభ్యులు ఆయా మండలాల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయని జల్ జీవన్ మిషన్ ట్రాన్స్పోర్ట్ ఆగి పోయిందని జడ్పిటిసి సభ్యులు సభలో అభ్యంత రాలు తెలియజేశారు. ఈ మేరకు చైర్ పర్సన్ ఆనంద అరుణమ్మ కూడా పెండింగ్ బిల్స్ పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పెండింగ్లో ఉన్న బిల్లు త్వరగా పూర్తిచేసే ప్రయత్నం చేయాలని అధికారులను సూచించారు. తర్వాత పంచాయతీరాజ్ శాఖకు రోడ్డు విషయాల్లో పనులు జరుగుతున్నాయని అన్ని మండలాల్లో మరమ్మత్తులు పనులు పూర్తి చేస్తున్నామని పంచాయతీరాజ్ అధికారులు తెలపగా మర్రిపాడు మండలం బ్రాహ్మణ గారి పల్లిలో రోడ్లు అస్తవస్తగా మారిపోయిందని మర్రిపాడు జెడ్పిటిసి సుధాకర్ తనదైన శైలిలో గల మెత్తారు ఆ రోడ్డు మొత్తం 7 కిలో మీటర్లు ఉందని పట్టించుకునే నాధుడే లేదని ఈ సందర్భంగా మరి పాడు జడ్పిటిసి సుధాకర్ తెలియజేశారు. అలాగే జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని చింతా రెడ్డిపాలెం గ్రామంలోని అంగన్వాడి భవనం కాంపౌండ్ వాల్ నీటి సదుపాయం మరుగుదొడ్లు దీని పరిస్థితి ఏమైందని అధికారుల్ని ప్రశ్నించారు. దానికి టెండర్ అయిపోయిందని అన్ని పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. జడ్పీ చైర్ పర్సన్ పనులు లేట్ అయ్యాయని ఆ కాంట్రాక్టర్లపై ఏమి యాక్షన్ తీసుకున్నారని తెలియజేయాలని అరుణమ్మ పై అధికారులను ప్రశ్నిస్తామని అది జడ్పీ నిధులని జెడ్పీ స్కూల్ తాము తమ నిధులతో చేస్తున్న దాన్ని ఎంపీపీ ఎలా వస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. తాము ఎక్స్‌ప్లనేషన్ జిల్లా కలెక్టర్‌కి ఇస్తామని పంచాయతీరాజ్ ఎస్సీ తెలియజేశారు. అలాగే పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ఆత్మకూరులోని జెడ్పీ గెస్ట్ హౌస్ భవనం అనుమతులకు విరుద్ధంగా ఎలా పడగొడతారని అది జడ్పీ గెస్ట్ హౌస్ బ్రిటిష్ కాలం నాటి భవనమని మొత్తం టేకుతో భవన నిర్మాణం జరిగిందని ఏ ఈ, ఎస్ సి, ఎలా విరుద్ధంగా పడగడతారు అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ అన్ని మండలాల్లో హౌసింగ్‌కి ఫన్ రిలీజింగ్ చేస్తున్నామని ఇళ్ల నిర్మాణం కోసం ఎవరైనా, అప్లై చేసుకోవచ్చు అని ఈ సందర్భంగా తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హౌసింగ్ లో బిల్డింగ్ పెండింగ్ ఉన్నాయని సత్వరమే పరిష్కరించేందుకు మెగ్గు చూపించాలని, ఈ సందర్భంగా తెలియజేశారు అనంతరం ఏడు స్థాయి సంఘాల సమావేశాలు మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగాయి. ఈ సమావేశానికి జడ్పిటిసి సభ్యులు జడ్పీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు అనుభవం ఆంధ్రప్రదేశ్‌కు వరం

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ సంబరాలలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు రూరల్, జూన్ 12, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై నిర్వహించిన విజయోత్సవ వేడుకలలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణ ఎలా చేయాలా అనేది కోటంరెడ్డి సోదరుల నుండి మనం నేర్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో గుంతలమయమై వున్న రోడ్ల స్థితి గతులు మార్చిందన్నారు. అనంతరం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గత వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తా మన్నారు. అభివృద్ధి సంక్షేమం సమ పాళ్లలో అమలు చేయగల సామర్థం ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడుకే ఉందన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు తనపరిపాలన దక్షతో ముందుకు తీసుకెళుతున్నారని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, కోడూరు కమలాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పధకాన్ని ప్రారంభించిన సోమిరెడ్డి




**మనుబోలు జూన్ 12 ప్రభాతవార్త** మనుబోలు మండలం బండేపల్లిలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు. తల్లికి వందనం పథకానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 8740 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెడుతుందని తెలిపారు. దేశంలో వృద్ధాప్య పెన్షన్ మొదలు పెట్టింది ఎన్టిరామారావు అని ఈ సందర్బంగా గుర్తు చేశారు. రాష్టం గత ప్రభుత్వం లో ఐదేళ్ళు వెనుకబడిందని విమర్శించారు. సర్వేపల్లిలో ఒక్క ఇరిగేషన్ శాఖలో 150 కోట్లు అవినీతి జరిగిందని విమర్శించారు. సర్వేపల్లిలో ఒక్క ఇరిగేషన్ శాఖలో 150 కోట్లు అవినీతి జరిగిందని విమర్శించారు. సర్వేపల్లి సమన్వయకర్త రాజ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతు విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ వినూత్న పాలసీలు తీసుకోస్తున్నారని రేపు యూనిఫాం బూట్లు పంపిణి చేయడం జరుగుతుందని ప్రతి విద్యార్థి స్కూల్‌కి వెళ్ళి బాగా చదువుకొని ర్యాంకులు సాధించాలని సూచించారు. అనంతరం బారి కేకుకట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. మొదటగా విమాన ప్రమాదానికి గురైన మృతుల ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.పాఠశాల పిల్లలకు నోట్‌పుస్తకాలు పంచిపెట్టారు.శృతిరెడ్డి,గాలి రామకృష్ణారెడ్డి,పి.రామకృష్ణయ్య, పచ్చిపాలరామిరెడ్డి,రాయపాటికిరణ్,అమీర్‌బాషా,వేణు,కోదండరామిరెడ్డి,మస్తానయ్య,మురళీరవి,రాజేంద్ర, రమేష్, ఎంపిడిఒ జలజాక్షి, అన్ని శాఖల అధిరులతోపాటు మండల వ్యాప్తంగా నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## సోమిరెడ్డికి స్వాగతం పలికిన నాయకులు



**నెల్లూరు,జూన్ 12,ప్రభాతవార్త-వైద్యం** ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొని ఆస్ట్రేలియా పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న సర్వేపల్లిశాసనభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు.

## వికసిత్ భారతం వైపు 11 ఏళ్ల దృఢయాత్ర

- పీవీఎన్ మాధవ్
- సేవ, సుపరిపాలన, సంక్షేమమే మోదీ పాలన పునాది
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



నెల్లూరు, జూన్ 12, ప్రభాతవార్త- వైద్యం భారతదేశం గత 11 సంవత్సరాలుగా సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం అనే త్రిసూత్ర సిద్ధాంతంతో అమృతకాల దిశగా పయనిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నెల్లూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకర్ల సమావేశం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియాకి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలం మన దేశానికి మహత్తరమైన పురోగతిని తీసుకువచ్చింది. సామాజిక న్యాయం, ఆర్థిక శక్తీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే మూడు పునాదులపై భారతదేశం ఎదుగుతోందని స్పష్టం చేశారు. 81 కోట్ల మందికి ఉచిత ధాన్యాలు, వీధి వ్యాపారులకు మేలు చేసే స్వనిధి పథకం, చిన్న వ్యాపారాలకు ముద్రా రుణాలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ ద్వారా అవినీతికి అడ్డుకట్ట- ఇవన్నీ ప్రధాని మోడీ పేదల పట్ల చూపిస్తున్న దయార్ధతకు నిదర్శనమని చెప్పారు. 44 లక్షల కోట్ల నిధులు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి చేరడం దేశంలో పరిపాలనా పారదర్శకత ఎలా పెరిగిందో చూపిస్తోందన్నారు.రైతుల సంక్షేమానికి పీఎం కిసాన్ బలంగా నిలిచింది፡ ప్రభుత్వానిదే పీఎం కిసాన్ ద్వారా రూ.3.7లక్షల కోట్ల నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్లాయి. సాయిల్ హెల్త్ కార్డులు, ఫసల్ భీమా, క్రెడిట్ కార్డు పరిమితి పెంపు, ఇవన్నీ రైతులకు భరోసా ఇచ్చాయి అని మాధవ్ చెప్పారు. జాతీయ విద్యా విధానం అమలుతో విద్య రంగంలో నూతన ఒరవడి ఏర్పడిందని తెలిపారు. ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్‌ల సంఖ్య పెరిగింది. 1.6 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఉజ్వల, మాతృ వందన, సుకన్య సమృద్ధి, ముద్రా లోన్స్ ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే కాదు. పీఎం ఆవాస్ పథకంలో 73 శాతం ఇళ్లు మహిళల పేరు మీద ఇవ్వడం మోదీ సర్కారు మహిళా సాధికారిత పట్ల కలిగిన నిబద్ధతను నిరూపిస్తుందని చెప్పారు. 33శాత రిజర్వేషన్ అమలుతో రాజకీయాల్లోనూ మహిలలకు అవకాశాలు విస్తరించాయన్నారు. పన్ను మినహాయింపు గరిష్టాన్ని పెంచడం, 5 జీ విస్తరణ, యూపీఐ విప్లవం, ఉడాన్ ద్వారా విమానయానం అందరికి అందు బాటులోకి తీసుకురావడం వంటి చర్యలు మధ్య తరగతి జీవితాలను మెరుగుపరిచాయని మాధవ్ పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్, జన ఔషధి కేంద్రాలు ఆరోగ్య సేవలను ప్రతి పౌరునికి చేరుస్తున్నాయని తెలిపారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధికి పునాది వేయడంతో పాటు, ఆర్టికల్ 370 రద్దు ద్వారా దేశ సమగ్రతను బలపరిచారని చెప్పారు. వందే భారత్ రైళ్లు, గతి శక్తి మాస్టర్ ప్లాన్, ఆర్థిక వృద్ధిగణాంకాలు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ- ఇవన్నీ భారతదేశాన్ని వికసిత్ దేశంగా నిలిపే దిశగా తీసుకెళ్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. ఈ 11 సంవత్సరాల మోదీ పాలన భారతదేశానికి మార్గదర్శి కాలంగా నిలిచింది. ఇది ఒక కొత్త శకం ఆరంభం. సభ్కా సాత్, సభ్కా వికాస్,సభ్కా విశ్వాస్‌అనే నినాదాన్ని ప్రతిదినం సాకారం చేస్తున్న ప్రభుత్వానికి అభినందనలు అని మాధవ్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఏపీఎ స్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నాపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కమల, రఘునాథరాజు, ఎస్టీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పుట్లూరు శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్సీ పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యారబోలు రాజేష్, గడ్డం విజయ్ కుమార్, యశ్వంత్ సింగ్, జిల్లా కార్యదర్శులు కాసా సీనయ్య, చిలకా ప్రవీణ్‌కుమార్,మోర్చా జిల్లా అధ్యక్షులుఅశోక్, కరణం సుభాషిణి,ప్రసాద్, కోవూరు ఇన్‌ఛార్జీ రాఘవయ్య, ఓబీసీ జోనల్ ఇన్‌ఛార్జీ ముక్కు రాధాకృష్ణ గౌడ్, ట్రెజరర్ సీవీసీ సత్యం, బీజేపీ సీనియర్‌నాయకులు బెల్లం కొండమాల్యాద్రి, వెంకటేశ్వర్లు,సుబ్బయ్య, మండల అధ్యక్షులు మదన్‌రెడ్డి, వీరాస్వామి,సాంబశివారెడ్డి, నాయుడు,సోషల్ మీడియా సిటీ కన్వీనర్ శివ తదితరులు పాల్గొన్నారు.



## సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం




**ఆత్మకూరు, జూన్12,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.రాధ ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు సామూహిక విద్యాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రామన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 3సంవత్సరాల జరుగుతున్న చిన్నారులందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు తల్లిదండ్రులు తీసుకురావాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల మానసిక, సామాజిక అభివృద్ధులకు సంబంధించిన ఆటలు, పాటలు, విద్యను అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్నారన్నారు. ప్రవేటు పాఠశాలలకు వలెనే ఇంగ్లీష్‌మీడియంలో చిన్నారులకు విద్యను అందిస్తున్నారన్నారు. కావున తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకురావాలని మహిళలకు పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. తల్లిదండ్రులతో చిన్నారులకు అక్షింతలు వేయించి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## శ్రీకాశీనాయన ఆశ్రమ పాఠశాల అభ్యున్నతికి లక్షరూపాయలు విరాళం



**ఆత్మకూరు, జూన్12,ప్రభాతవార్త:** ఆత్మకూరులోని శ్రీ కాశీనాయన ఆశ్రమ పాఠశాల అభ్యున్నతికి, విద్యార్థులకు మౌళిక వసతుల కల్పనకు ఆత్మకూరు శ్రీసాంబశివ చారటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వర్‌రెడ్డి గురువారం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 13న జరిగిన శ్రీ కాశీనాయన ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన తాను విద్యార్థులకు మౌళిక వసతుల కొరకు లక్షరూపాయలు అందజేస్తానన్నారని ప్రస్తుతం పాఠశాల పునః ప్రారంభం నాడు చెప్పిన మాట ప్రకారం శ్రీ కాశీనాయన పాఠశాల యాజమాన్యానికి తమ కార్యాలయంలో లక్షరూపాయలు విరాళం అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ పాఠశాల మౌళిక వసతుల కల్పనకు కంచి పరమేశ్వర్‌రెడ్డి అందజేశారని వారికి తాము ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకునేలా విద్యాబుద్ధులు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, విద్యాలయ సిబ్బంది , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీదేవి,భూదేవి అచ్యుతస్వామి కళ్యాణ మహోత్సవం



**కలువాయి జూన్ 12 ప్రభాతవార్త :** శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ అచ్యుత స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంనకు దత్తత దేవాలయంగా ఉన్న మండలంలోని కుల్లూరు గ్రామంలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ అచ్యుత స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా వేడుకలను వైభవంగా నిర్వహి ంచారు. ఇందులో భాగంగా గురువారం స్వామి వారి సుప్రతసేవతోపాటు నిత్య హోమం, అనంతరం కళ్యాణ మహోత్సవాన్ని ఉభయకర్తలు మాజీ శాసన మండలి సభ్యులు మాదాసు గందాదరం నళినమ్మ దంపతుల ఆద్వర్యంలో నిర్వహించారు.సాంప్రదాయ బద్ధంగా మాదాసు ఇంటి నుండి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను ముత్యాల తలంబ్రాలను మాదాసు యజ్ఞ పవన్ ,అపర్ణా దంపతులు కళ్యాణ వేడుకలో సమర్పించారు.కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. రాత్రి ధ్వజవాహన సేవ నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్ధిక సహాయం



**సీతారామపురం జూన్ 12 ప్రభాతవార్త :** సీతారామపురంలోని బెస్తకాలనీ కి చెందిన కృష్టా సురేష్ అనే వ్యక్తి గత కొంత కొన్ని సంవత్సరాలు బోన్ క్యాన్సర్ బారిన పడి ఇటీవల మృతి చెందాడు.నాసేవకోసం, నావంతు రాష్ట్ర కమీటి మెంబర్ జనసేన ఉదయగిరి నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు సహకారంతో బోన్ క్యాన్సర్‌తో మరణించిన వ్యక్తి కుటుంబానికి 15 వేలరూపాయాల ఆర్ధిక సహాయాన్ని మండల జనసేన మహిళా నాయకురాలు బోగినేని సులోచనమ్మ మండల జనసేన నాయకులు బోగినేని కాశీరత్తయ్య,మృతుని బార్య లక్ష్మీ కి అందజేశారు. మృతుడుకి ఒక్క సంవత్సరం కుమారుడు ఉన్నాడని నిరుపేద కుటుంబలోని ఇంటి పెద్ద దిక్కు మరణించడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగి పోయిందని మృతిని కుటుంబ స్దితి గతులను నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొని వెళ్లి మృతుడు కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు చేపడతామని హామి ఇచ్చారు.ఈకార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యాక్షులు ఎస్ రాజశేఖర్,వార్డు మెంబర్ తోట మనోజ్ ,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## తోపుగుంటలో సామూహిక అక్షరాభ్యాసం



**కలువాయి జూన్ 12 ప్రభాతవార్త :** మండలంలోని తోపుగుంట గ్రామంలో ఐసిడిఎస్ రాపూరు ప్రాజక్టు పరిధిలోని తోపు గుంట ఎస్‌సి కాలనీలో గురువారం సామూ హిక అక్షరాభ్యాస కార్యక్ర మాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరమ్మ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, ఆశాకార్యకర్తలు,అంగన్‌వాడీ కార్యకర్తలు ,ప్రదానోపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కావలసిన ఆట పాటలతో కూడిన విద్యను అందించడమే కాకుండా బల వర్దకమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. తల్లులు దీనిని దృష్టిలో పెట్టుకొని తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె ఈ సందర్బంగా తెలియజేశారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాళ్ళు రాజ్యలక్ష్మీ,ఉపాధ్యాయు రాళ్ళు బి.వి రమణమ్మ,కె అరుణా,టి మమతా, పాల్గొన్నారు.

## ఖైదీలు పరివర్తనచెంది నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి



**కావలి, జూన్12 ప్రభాతవార్త :** ఖైదీలు పరివర్తనచెంది నేరప్రవృత్తికి దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో సమాజంలో కలిసిపోయి ఉన్నత జీవితం గడపాలని డాక్టర్ మహేష్ పిలుపునిచ్చారు. కావలి సబ్‌జైలులో వెంగళరావునగర్ పిహెచ్‌సి సెంటర్, డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సంయుక్త ఆధ్వర్యంలో ఖైదీల పరివర్తన, నేరప్రవృత్తి, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ పిహెచ్‌సి వైద్యులు ఎం.మహేష్ ఖైదీలకు పరీక్షలు నిర్వహించి మందులు వ్రాసిఇచ్చారు. డాక్టర్ రామ్‌సెంటర్ ఉచితంగా మందులను పంపిణి చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడారు. తప్పులు చేసి జైలుకువచ్చి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. జైలునుంచి బయటకు వెళ్లిన తర్వాత పరివర్తనతో మెలిగి సమాజంలో కలిసిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరిండెంట్ కె.చిన్నసుబ్బయ్య, డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరక్టర్ కూనం తాతిరెడ్డి, లోక్‌అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి, పిహెచ్‌సి కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎఎంసి ఛైర్మన్ ప్రసాద్‌పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు



**కావలి, జూన్12 ప్రభాతవార్త :** కావలి మాజీ ఎఎంసి ఛైర్మన్, వైసిపినేత సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్‌పై కావలి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీకేసును నమోదు చేశారు. కావలి మండలం చెన్నాయపాలెంలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని ప్రసాద్‌యాదవ్ దుర్భాషలాడి దాడిచేసినట్లు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చోటుచేసుకుంది. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని పోలీసులు అట్రాసిటీ కేసును నమోదు చేశారు. వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్ ముఖ్య అనుచరుడు.

## అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం



**లింగసముద్రం, జూన్ 12, ప్రభాతవార్త :** మండలంలోని వెంగళాపురం గ్రామంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది. అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో గురువారం రోజు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం అయింది. గ్రామంలోని చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు ఆడుకోవడానికి ఆట వస్తువులు, పోషక ఆహారాలు అంగన్‌వాడీల్లో లభిస్తాయని ఈ కార్యక్రమంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, కుమారి, సులోచన, బుజ్జమ్మ పాల్గొన్నారు.

## పేట తహసిల్దార్‌గా అనిల్



**అనుమనముద్రంపేట, జూన్12,ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలం నూతన తహసిల్దార్‌గా కె.అనిల్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీరామకృష్ణ ఉద్యోగ విరమణ పొందడంతో ఇటీవల సాధారణ బదిలీల్లో నెల్లూరు ఆర్‌డిఒ కార్యాలయంలో డిఎఒగా విధులుని ర్వహిస్తున్న అనిల్‌కుమార్ తహసిల్దార్‌గా నియమితు లయ్యారు. తొలుత ఆయన స్థానికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీహజరత్ సయ్యద్ ఖాజా నాయబ్‌రసూల్ స్వామివారి దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.దర్గా ఇఒ షేక్ మహ్మద్ హుస్సేన్ తహసిల్దార్ అనిల్‌కుమార్‌ను దగ్గరుండి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. అనంతరం తహసిల్దార్‌కు కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో , బొకేలతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వర్లు, రీసర్వే డిటి సతీష్, ఆర్ఐ మస్తాన్‌వలి, విఆర్ఒలు, విఆర్ఎలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూపరంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## కావలి డిపోమేనేజర్ శ్రీనివాసులు కందుకూరుకు బదిలీ



**కావలి, జూన్12 ప్రభాతవార్త :** కావలి ఆర్‌టిసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు కందుకూరు డిపోకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయనను గురువారం కావలి నుండి కందుకూరు డిపోకు మార్చారు. కావలి డిపో పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్ఎసి)తో కావలి డిపో మేనేజర్‌గా కొనసాగుతారు. కందుకూరు, కావలి ఆర్‌టిసి డిపోల బాధ్యత ఆయన నిర్వహిస్తారు.

## విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



**ఉదయగిరి, జూన్ 12, ప్రభాతవార్త :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మండల విద్యాధికారి -2 తోట శ్రీనివాసులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో విధాలుగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రయత్నం చేస్తుందని, ప్రతి విద్యార్థి ప్రభుత్వ అవకాశాలను అందిపుచ్చుకొని రాణించాలని ఆయన సూచించారు.

## ఉదయగిరికి నూతన తహశీల్దార్



**ఉదయగిరి, జూన్ 12, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల నూతన తహశీల్దార్‌గా ఎల్.రామ్మోహన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిటీగా పని చేస్తున్న ఈయన బదిలీలలో భాగంగా ఉదయగిరికి తహశీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ సుభద్ర సైదాపురం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈయన భూ సమస్యలను వెంటనే పరిష్కార మార్గాన చూస్తానని ఆయన అన్నారు. కార్యాలయానికి వచ్చే ఎటువంటి పని అయినా త్వరగా చేసి న్యాయం చేకూరుస్తానన్నారు.

## హిందువులంతా సంఘటితం కావాలి



**ఉదయగిరి, జూన్ 12, ప్రభాతవార్త :** హిందువులంతా సంఘటితం కావాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఉదయగిరి టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని హైందవత్వాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గంలో మార్పులు చేర్పులతో పాటు ఉదయగిరి వీహెచ్‌పీ ప్రఖండ ఆధ్వర్యంలో మార్పులు బజరంగ్ దళ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార కార్యనిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## గండిపాలెం జలాశయం ప్రధాన కుడి కాలువ పరిశీలన



**ఉదయగిరి, జూన్ 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గండిపాలెం జలాశయం ప్రధాన కుడి కాలువ గుడినరవ వద్ద ఉదయగిరి జల వనరుల శాఖ ఇన్‌ఛార్జీ డీఈఈ చంద్రమౌళి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. రానున్న సీజన్ పంటకు జలాశయం నుంచి నీరు వదిలేందుకు అవసరమున్న చోట మరమ్మత్తుల పనులు చేపట్టేందుకు ఈ పరిశీలన చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ తప్పిదం లేదు.. క్షమాపణ కోరిన బాలిక తండ్రి



**ఉదయగిరి, జూన్ 12, ప్రభాతవార్త :** ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్ మైనర్ బాలిక పట్ల అనుచిత ప్రవర్తన చేశారంటూ డాక్టర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన విషయంలో బాలిక తల్లిదండ్రులు వైద్యశాల సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. కేవలం అపార్థం జరిగిపోవడం వలన ఆ గందరగోళానికి ఆస్కారం కలిగిందని డాక్టర్‌ది ఎలాంటి తప్పు లేదని క్షమాపణ కోరారు. చిన్న పిల్ల కావడం వల్ల పరీక్షించేటప్పుడు డాక్టర్ చేతులు తగలటం వల్ల అది బ్యాడ్ టచ్ అని భావించి తల్లిదండ్రులకు చెప్పిందని ఆవేధంలో డాక్టర్‌పై విరుచుకుపడ్డామని వాస్తవాలు తెలుసుకుంటే అలాంటిదేమి లేదని వారు తెలిపారు. సీసీ కెమెరాల పుటేజ్ లేకపోతే పరిస్థితి ఏమిటి అంటూ వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు ఎప్పుడు రోగి క్షేమం కోసమే ఆలోచిస్తారు కానీ మరో రకమైన ఆలోచన ఉండదని గుర్తుంచుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ శివరాం, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, బాలిక తండ్రి వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

## రాపూరు ఈద్గా అబివృద్ధికి రూ.1 లక్ష విరాళం



**రాపూరు,జూన్13ప్రభాతవార్త :** రాపూరు మండల తెలుగుదేశం పార్టీ మండల మైనారిటీ ఉపాధ్యాక్షుడు సయ్యద్ ఖాజామోహిద్దీన్ ఆయన తండ్రి సయ్యద్ రసూల్ పేరు మీద రాపూరు ఈద్గా అబివృద్ధికి రూ. 1 లక్ష విరాళం ప్రకటించారు. గురువారం ఆయన రాపూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి ఈద్గాను సందర్శించారు. ఈద్గాలో టైల్స్ వేసేందుకు ఆయన తండ్రి పేరుమీద లక్ష రూపాయిలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, ప్రసాద్ నాయుడు, మాధవ రెడ్డి, అహ్మద్, ఛాన్ బాషా, ఆరీఫ్, ఇస్మాయిల్ తదితరులున్నారు.

## ఏఎస్‌పేటలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం పోస్టర్ విడుదల



**అనుమనముద్రంపేట, జూన్12,ప్రభాతవార్త:** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకలోని గురువారం హెడ్స్ స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఎస్‌పేట మండల తహిసల్దార్ కె.అనిల్‌కుమార్, ఎంపిడిఒ ప్రసన్నకుమారి, ఎంఇఒ-2సాయిప్రసాద్ లు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా తహసిల్దార్ కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ఏటా జూన్12న జరుపుకుంటారని బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. బాల కార్మిక వ్యవస్థ చట్ట విరుద్ధమైన చర్య అని 14సంవత్సరాల లోపు పిల్లలను బడికి మాత్రమే పంపాలని, పనుల్లో చేర్చడం నేరమన్నారు. ఎంపిడిఒ ప్రసన్నకుమారి మాట్లాడుతూ బాల కార్మికులను వీధి బాలలను చూసినప్పుడు 1098 కానీ డయల్100కి కానీ తెలియజేయాలన్నారు. హెడ్స్ సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొట్ట గడవక జీవనోపాదికి కష్టపడి పనిచేసే వారిని కార్మికులంటారని అదే విధంగా బాల్యంలోనే పనులు చేసి డబ్బు సంపాదించుకొని పొట్టపోసుకొని వారిని బాలకార్మికులు అంటారన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ సాయిప్రసాద్,జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధా ్యయురాలు వి.రుక్మిణి, దొరబాబు,ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ సి.హెచ్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయం లో సంబరాలు

**బిట్రగుంట జూన్ 12 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన బోగోలు లోని టీడీపీ కార్యాలయం లో గురువారం కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి అయిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ ఎం. నాగేశ్వరావు ఆధ్వర్యంలో కేకును కట్ చేసి ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కావలి ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్. సుదీర్ బాబు,జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి ఎల్. మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## యోగాధ్ర కార్యక్రమంలో ప్రతిభావంతులు.




**కలిగిరి, జూన్12, ప్రభాతవార్త;** ప్రభుత్వం చేపట్టిని యోగాంధ్ర కార్యక్రమంలో వివిద కేటగిరిల్లో అనేక మంది యువకులు, విద్యార్దులు కలిగిరి మండలంనుండి మంచి ప్రతిభకనపరిచారని వారందరికీ అభినందనలు తెలియ జేసినట్లు కలిగిరి యంపిడిఓ ప్రత్యూష తెలిపారు.యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలకు అర్దమయ్యే రీతిలో తీసిన షార్ట్ ఫిల్మ్ షూటింగ్ విభాగంలో కలిగిరి మండలం అనంతపురంగ్రామ సచివాలయంలో పనిచేస్తున్న కోట అనీల్ కుమార్‌రెడ్డి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు యంపిడిఓ తెలిపారు. వారికి తమ అభినందనలు తెలియ జేసినట్లు యంపిడిఓ తెలిపారు. అదేవిధంగా యోగాంధ్రకార్యక్రమంలో బాగంగా శ్లోక విభాగంలో శిద్దనకొండూరుకు చెందిన ఇంటర్ సెకండ్‌ఇయర్ విద్యార్ది పేరిశెట్టి జితేందర్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు యంపిడిఓ తెలిపారు. అదేక్రమంలో వ్యాస రచన పోటీలలోశిద్దనకొండూరు హైస్కూల్‌లో చదివే 9వ తరగతి విద్యార్ది యం. బాలరిషికేశవ్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాదించిరాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనారని వీరందరికీ వీరికి సహకరించిన వారికి తమ అభినందనలు తెలియ జేస్తున్నట్లు యంపిడిఓప్రత్యూష తెలిపారు.

## రాపూరులో ఏడాది పాలన విజయోత్సవ సంబరాలు



**రాపూరు,జూన్13ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పాలన విజయోత్సవ సంబరాలను గురువారం రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యలయం ఆవరణలో మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా కేక్ కట్ చేసి నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం మండల పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్టంలో రాక్షస పాలన పోయి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆధ్యక్షతన కూటమి ప్రభుత్వం వచ్చి నేటికి ఒక ఏడాది కాలం పూర్తయిందన్నారు. ఈ ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. రాష్టంలో గుంతలమయంగా వున్న రోడ్డులకి మరమత్తులు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం ఒకే పర్యాయం వెయ్యి రూపాయిల ఫించన్ పెంపు, నేడు మహిళలకు అమ్మకు వందనం ద్వారా నగదు పంపిణీ, పాత పద్దతిలో 15 రోజుల పాటు ప్రజలకు అనుకూలంగా రేషన్ పంపిణీ వంటి కార్యక్రమాలను పారదర్శంకగా అమలు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్టం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాపూరు సోసైటీ మాజీ ఆధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, నాయకులు మూరం రెడ్డి మధుసూధన్ రెడ్డి, బోజ్జనపల్లి, తూమాయి, అకిలివలస గ్రామ సర్పంచ్‌లు ఏటూరు నాగభూషణం రెడ్డి, పైడిపూల చంద్రమోహన్, చెన్ను పెంచల రెడ్డి, నాయకులు ప్రసాద్ నాయుడు,ఖాజా, అందెన మాధవ రెడ్డి, దందోలు హరికృష్ణా రెడ్డి, అహమద్, సికిందర్, డాక్టర్ గజరా వేణుగోపాల్, మందాటి చంద్రమోహన్,సంకల పాపయ్య, మహేష్, మెంటా నారాయణ, పరంధామి రెడ్డి, బక్షు,పఠాన్ ఛాన్ బాషా, నరేంద్ర, ఏయంసీ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు గుండు రాఘవయ్య,కూకాటి పెంచలయ్య,పోట్టేళ్ల వెంకటేశ్వర్లు, కంబాలపల్లి పరంధామి రెడ్డి,శ్రీనయ్య, పెద్ద ఎత్తున వివద గ్రామాలకు చెందిన తెలుగుదేశం, కూటమీ పార్టీ నాయకులు,కార్యకర్తలు వున్నారు.

## పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పంచండి



**సీతారామపురం జూన్ 12 ప్రభాతవార్త :** చిన్నారుల తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను కోరారు. ఆమె గురువారం మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన అంగన్‌వావీ పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతు తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మవడి లాంటి వని అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లకలు అర్దం అయ్యే రీతిలో ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందిస్తామని అన్నారు.ఈకార్యక్రమంలో ఆమెతోపాటు అంగన్‌వాడీ కార్యకర్త పావనీ,ఆయాలు ఎఎన్ఎమ్ సుమా,తల్లులు పాల్గొన్నారు.

## అంగన్వాడి పిలుస్తుంది సూపర్వైజర్ నిర్మల



**కొడవలూరు, జూన్ 12, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మల ఆధ్వర్య ంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ దిట్టుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు విద్యను బోధిస్తున్నారని తల్లులకు వివరించి అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో అంగన్వా డి కార్యకర్తలు రమీజా, ఎస్ మనిన్, నాగరాజమ్మ, శాంతి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వీ ఆర్‌ఏ మృతి

**కొడవలూరు, జూన్ 12, ప్రభాతవార్త:** మండలం గుండాలం పాలెం గ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న కేశవులు మృతి చెందారు. వివరాలు సోమవారం అపోలో హాస్పిటల్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో జరిగింది. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.

## బుజ్జమ్మ సేవా ట్రస్ట్ సేవలు అభినందనీయం

### - మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్

**ముత్తుకూరు, జూన్ 12, ప్రభాతవార్త** బుజ్జమ్మ సేవా ట్రస్ట్ సేవలు అభినంద నీయమని మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ కొనియా డారు. గురువారం మండల కేంద్రం లోని గొల్లవీధిలో బుజ్జ మ్మ సేవా ట్ర స్ట్ వ్యవస్థాపకులు గొలుసు రత్నం ని వాసంలో ఆత్మీయ సన్మానం కార్యక్ర మంలో మండ లాధ్యక్షుడు నీలం మల్లి



కార్జున యాదవ్‌తో పాటు మత్స్యకారి విభాగ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు అక్కయ్యగారు ఏడుకొండలు పాల్గొన్నారు. సేవా ట్రస్ట్ వ్యవ స్థాపకులు రత్నంను శాలువా కప్పి సన్మానిం చారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా రాష్ట్రంలో, గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తుందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అభివృద్ధి సంక్షేమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రెండు కళ్ళు అన్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నిర్వాహకులు రత్నం అనేక సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్లడం చాలా అభినందనీయమని ఆయన అన్నారు.

## పిఆర్ఏఈగా జివి శ్రీనివాస రావు భాధ్యత స్వీకరణ



**ముత్తుకూరు, జూన్ 12, ప్రభాతవార్త** మండల పిఆర్ఏఈగా జివి శ్రీనివాస రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొడవలూరు నుంచి సాధారణ బదిలీలో భాగంగా ముత్తుకూరుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## రైల్వే ఫ్లాట్ ఫాం పై వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, జూన్ 12, ప్రభాతవార్త :** నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ నాల్గవ నెంబర్ ఫ్లాట్ ఫామ్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని రైల్వే పోలీసులు సోమ వారం ఉదయం గుర్తించారు. మృతునికి సు మారు 35 నుండి 40 ఏళ్ళ మధ్య వయస్సు ఉంటుందని అనారోగ్యముతో మరణించినట్లు భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు గల ఆఫ్ హాండ్స్ టీ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాం ట్ ఉన్నట్లు రైల్వే పోలీ సులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం



ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే ఎస్సై హరి చందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి



**కోవూరు, జూన్ 12ప్రభాతవార్త** : కోవూరు మండలం వేగూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రీ సర్వేకు సంబంధించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ గ్రామంలో భూముల రీ సర్వేకు ఐదు బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వారు అడిగిన సమాచారాన్ని సకాలంలో అందించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఈ రీ సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు రీ సర్వేకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా తగు సమాచారంతో సర్వే బృందాలకు గానీ, తహసీల్దార్ కార్యాలలయంలో అందజేయాలన్నారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, గ్రామ రెవెన్యూ అధికారి మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ అమరావతి, టీడీపీ సీనియర్ నాయకులు కె. శ్రీనివాసులు, ఉన్నారు.

## సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం



**కోవూరు, జూన్ 12ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇనమడుగు సెక్టార్ వేగూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటల ద్వారా విద్యను అందించడమే కాకుండా వారికి బలవర్ధకమైన పౌష్టికాహారం కూడా అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు నిండిన 15 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బి. రమణమూర్తి, జి. వెంకటరామిరెడ్డి, వి. అముల్‌రాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య సిబ్బంది, తల్లులు ఉన్నారు.

## కృత్యంతర బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలి



కోవూరు, జూన్ 12ప్రభాతవార్త : కోవూరులోని లైబ్రరీ సెంటర్ ప్రాంతంలో ఉన్న మోడల్ ప్లస్ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి 2 వై. చెంచులక్ష్మమ్మ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు విద్యార్థులకు కావాల్సిన నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూస్, డిక్షనరీలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా తల్లిదండ్రుల్లో మరింత అవగాహన కల్పించి తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు

## పచ్చిపాల శంకర్‌రెడ్డి సాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం





**కోవూరు, జూన్ 12ప్రభాతవార:** కోవూరులోని జాతీయ రహదారి షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంతంలో పచ్చిపాల శంకర్‌రెడ్డి సాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ చలివేంద్రంను ఏర్పాటు చేశారు. గత 22 సంవత్సరాలుగా సాయిబాబా మందిరం చైర్మన్ పచ్చిపాల సుజాతమ్మ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని దివంగత పచ్చిపాల విజయలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ పచ్చిపాల రాజా విక్రమ్‌రెడ్డి సహకారంతో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.్డి, ఆలయ అర్చకులు జగదీష్ స్వామి, పచ్చిపాల కుటుంబ సభ్యులు ఉన్నారు.

**వైభవంగా షిరిడీ సాయినాథునికి పూజలు**

కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కన్నులపండువగా చేపట్టారు. మందిర వ్యవస్థాపకులు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

## ఘనంగా కూటమి వన్ ఇయర్ సంబరాలు



**జలదంకి, జూన్12, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ తొలియేడాది విజయోత్సవ సంబరాలు మండల కేంద్ర మైన జలదంకిలో గురువారం ఘనంగా నిర్వ హించారు. అపార అనుభవశా లి, పాల నాద్యక్షుడుసంపద సృష్టికర్త ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏలుబడిలో రాష్ట్రం అన్ని రంగాలలో దూసుకు పోతుంటే, ఎంఎల్ఏగ తొలిసారి పగ్గాలు చేబూనిన ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ నాయకత్వంలో నియోజకవర్గం సస్యశ్యామలంగ వెలుగొందుతున్న వేళ కూటమి నేతలు కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. మండలపార్టీ కన్వీనర్ పులిగుంట మధుమోహన్‌రెడ్డి నాయకత్వంలో బారి ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. పసుపుమయంతో కార్యాలయం వెలుగొందుతుంటే మరోసీని యర్ నేత పూనూరు భాస్కర్‌రెడ్డి తదితరులు తరలిరాగ వన్ ఇయర్ కేక్‌ను కట్‌చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. చంద్రబాబునాయుడు జిందా బాద్, కాకర్ల సురేష్ నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలతో ఆప్రాంతం మారుమ్రోగింది. ఈసందర్భంగ మధుమోహన్‌రెడ్డి కార్యకర్తలను ఉత్తేజపరిచే ప్రసంగం చేశాడు. ఎంఎల్ఏ మొదటి ఏడాదిపాలనలో అన్ని వర్గాలవారిని మెప్పిస్తు పాలన సాగించడం ఎంతో ఆనందదాయకమని కొనియాడారు. మునుముందు మరింతగ ప్రజలకు చేరువయ్యే పాలన కొనసాగిస్తాడని ఆశాభావం వ్యక్తంచేశాడు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దా నాలను నెరవేరుస్తు ముందుకు దూసుకుపోవడం మన ఎంఎల్ఏకే దక్కిందన్నారు. కావలి కాలువ పూడిక తీసిన నేపద్యంలో ప్రస్తుతం సోమశిల జలాలు ఎలాంటి అడ్డంకులు లేకుండ గలగల పారుతూ చినక్రాక బాలన్సింగ్ రిజర్‌వాయర్‌కు చేరడం రైతన్నల ముఖాలలో ఎక్కడలేని ఆనంద చాయలు కనిపిస్తున్నాయని కార్యకర్తల హర్షద్వానాల మద్య తెలియజేశాడు. ఈరోజు రెండవకారు పెర్లు మండలంలో కళకళలాడు తున్నాయంటే అది తెలుగుదేశం ఘనతగ శ్లాఘించారు. రాబోవు కాలంలో మరింతగ మంచి పాలన అందిం చేందుకు డైనమిక్ ఎంఎల్ఏ కాకర్ల కృషిచేస్తాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని మధుమోహన్‌రెడ్డి అన్నా రు. ఈవిజయోత్సవ సంబరాలలో నాయకులు కూరపాటి సుదాక ర్‌రెడ్డి, యువనేత పులిగుంట మహేంద్రరెడ్డి, ఏగూరి రఘు, కుంకు వెంకటేశ్వర్లు, మారుబోయిన నారాయణ, ఒంగోలు మదన్, ఒంగోలు మాల్యాద్రి, భీమ వరపు తిరుపతయ్య, గోను రామన్న, ఉప్పు ప్రసాద్, కూరపాటి దయాకర్ రెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు : ఊటుకూరు నాగార్జున

**నెల్లూరు రూరల్, జూన్ 12, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ప్రజలు అసహ్యించుకుంటున్నారని వైఎస్ఆర్సిపి జిల్లా యోజన విభాగం అధ్యక్షుడు కార్పొరేటర్ నాగార్జున ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. నెల్లూరు రాంజీ నగర్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైసిపి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రితరెడ్డి పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ ఏడాది కాలం పూర్తయినప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు ఈ ప్రభుత్వాన్ని అసహ్యించుకుంటున్నారని తెలిపారు. అనేక వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపిస్తే ఈ రోజు అదే ప్రభుత్వం చేతుల్లో ప్రజలు దగాకు గురయ్యారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా వారికి మొండి చెయ్యి చూపింది అని చెప్పారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వ మాటలు నీటి మూటలుగా మారాయి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తవుతున్నప్పటికీ చంద్రబాబు నాయుడు యువతకు ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకి ఇస్తామన్న 3 వేల రూపాయల నిరుద్యోగ భృతికి కూడా ఈ ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. గత ప్రభుత్వంలో నియమించిన వాలంటీర్లను, మొబైల్ రేషన్ ప్రతినిధులను తొలగించి వారి జీవితాన్ని రోడ్డున పడేసారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా ఏడాది కాలంగా ప్రభుత్వ అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనంతపురంలో జూన్ 4వ తేదీ బాలిక కనబడడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు ఇస్తే.. వారు పట్టించుకోకపోవడంతో.. ఆరు రోజుల తర్వాత ఆ బాలిక శవమై తేలిందన్నారు. అలాగే సత్యసాయి జిల్లాలో మైనర్ బాలికను 14 మంది రేప్ చేస్తే.. ఇంతవరకు వారిపై చర్యలు శూన్యమన్నారు. ఎన్నికలకు ముందు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సుగాలి ప్రీతి హత్యను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ కేసు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, పూనకంతో ఊగిపోయి ఓటు బ్యాంకు పాలిటిక్స్ చేశారని మండిపడ్డారు. ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ కేసుకు సంబంధించి నిజా, నిజాలను నీకు తేలుస్తామన్న పవన్ కళ్యాణ్ ఎందుకు మీన మేషాలు లెక్కిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వకీల్ సాబ్ సినిమాలో లాగా ప్రజలకు న్యాయం చేస్తారనుకున్న పవన్ కళ్యాణ్ ఈరోజు చంద్రబాబు ఏది చెబితే అదే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఏడాది దుర్మార్గపు పాలనకు నిరసనగా వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సూచనల మేరకు నిరసన ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. జూన్ 13వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరు బారకాసు సెంటర్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టర్‌కి వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి యువత విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికాలం పూర్తయినప్పటికీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. లోకేష్ యువగళంలో చెప్పిన హామీలన్నీటి మరచి.. ఈరోజు నిలువునా యువతను దగా చేశారని మండిపడ్డారు. విద్యార్థులకు ఐదు క్వార్టర్ల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉండగా కేవలం ఒకటిన్నర క్వార్టర్‌కు సంబంధించిన ఫీజు రీఎంబర్స్ మెంట్ మాత్రమే చెల్లించారని, దీంతో విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసినవిద్యా సంస్కరణలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యాశాఖను నిర్వీర్యం చేస్తుందన్నారు.



## గుజరాత్ ఘోరవిమాన ప్రమాదం పట్ల మాజీమంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

**కోవూరు జూన్ 12 ప్రభాతవార్త :** గుజరాత్ అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం చాలా దురదృష్టకరమని మాజీ మంత్రి వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహ్మదాబాద్ లోని మేఘాని నగర్ లోని బీజే మెడికల్ కళాశాల మెస్పై విమానం కూలడంతోవిమానంలోని ప్రయాణికులతో పాటు మెస్ లోని దాదాపు 20 మంది మెడికోలు కూడా మరణించడం తనను తీవ్రంగా కలిసి వేసిందన్నారు ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబాలకు అండగా ఉండాలని అదే విధంగా క్షతగాత్రులకు వెంటనే సరైన వైద్య సదుపాయం అందించాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాను అన్నారు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ఆ బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుని వేడుకుంటున్నామన్నారు



## సూపర్‌సిక్స్ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన టిడిపి ప్రభుత్వం

### కావలిలో విజయోత్సవ సంబరాలు

**కావలి, జూన్12 ప్రభాతవార్త** సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తిఅయిన సంద ర్భంగా కావలి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో గురువారం విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. కూటమి నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే దగుమాటి కేక్ కట్‌చేసి స్వీట్స్‌ను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి పాలన ఏడాది పూర్తవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విధ్వంసం, రాక్షసపాలన నుంచి కూటమి ప్రభుత్వం ప్రగతిపథంలో రాష్ట్రాన్ని పరుగులు తీయిస్తుందన్నారు. గత వైసిపి పాలనలో నిర్వీర్యమైన యువతను గాడిలో పెట్టేందుకు టిడిపి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా టిడిపి పాలన సాగుతుందన్నారు. నిరంతర శ్రామికుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంవైపు పయనించేలా పాటుపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అండగా ప్రధాని నరేంద్రమోడి, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మా యువ నాయకుడు నారా లోకేష్‌లు ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంవైపు పరుగులుతీయించేలా పాటుపడుతున్నారన్నారు. చంద్రబాబు ఆశీస్సులతో కావలిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. వైసిపి అరాచక పాలనలో భ్రష్టుపట్టిపోయిన ఈ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కావలిని కాపుకాస్తూ ముందుకు నడుస్తానన్నారు. టిడిపి నేతలు మాట్లాడుతూ 72 సంవత్సరాల రాజకీయ చరిత్రను తిరగరాసిన కావలి కనకపట్టణ రథసారధి, కావలి నియోజకవర్గ అభివృద్ధిప్రదాత, కావలిని కాపుకాస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి పట్టాభిషేకం జరిగి ఏడాది అయిందన్నారు. దీంతో ఎమ్మెల్యే దగుమాటి చేతులమీదుగా కేక్‌ను కట్‌చేసి, స్వీట్స్ పంపిణిచేసి సంబరాలు జరుపుకుంటున్నామన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటిని దుశ్శాలువాలతో, పూల బొకేలతో ఘనంగా సత్కరించి పూలమొక్కలు అందచేశారు. తెలుగుదేశం జిందాబాద్... ఎమ్మెల్యే దగుమాటి జిందాబాద్... అన్న నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ఈ వేడుకల్లో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



## ఏడాది పాలనలో అభివృద్ధి పరుగులు

- నెల్లూరు గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో అంబరాన్ని అంటిన సంబరాలు
- భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కార్యకర్తలు
- మంత్రి నారాయణ సార్ వ్యూహాత్మక ఆలోచనలతోనే నెల్లూరు అభివృద్ధి

**నెల్లూరు, జూన్ 12, ప్రభాతవార్త – వైద్యం** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. నెల్లూరు గోమతి నగర్‌లోని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ క్యాంపు కార్యాలయంలో విజయోత్సవ వేడుకలను టీడీపీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించారు. జేజే నినాదాలతో హోరెత్తిన మంత్రి క్యాంపు కార్యాలయం మార్మోగింది. 12 నెలల ప్రజారంజక పాలనకు 12 కేజీల కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టిన సిటీ టీడీపీ నేతలు. హామీల అమలుతో రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటంతో ఫుల్ జోష్‌లో టీడీపీ క్యాడర్ కనిపించింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పండుగలా విజయోత్సవ సంబరాలు పార్టీ శ్రేణుల మధ్య జరుపుకుంటున్నామన్నారు. మంత్రి నారాయణ ప్రజా పాలనకు నేటితో ఏడాది పూర్తి సందర్భంగా ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచి ప్రజా పాలన ప్రారంభమై నేటికి ఏడాది పూర్తయిందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు పడిందని, విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం మొదలైందని సంతోషం వ్యక్తం చేశారు. ఇచ్చిన ప్రతి హామీ ఒక పద్దతి ప్రకారం అమలు చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి బాట పట్టిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని ఎన్నో పనులు ఏడాదిలోనే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత నిధులతో సహాయం చేస్తున్న గొప్ప వ్యక్తి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అని కొనియాడారు. ప్రజలతో పాటు కార్యకర్తల మనసులు చూరగొంటున్న మహానేత మంత్రి నారాయణ అని అభివర్ణించారు. సిటీలో 46 పార్కుల ఆధునీకరణ, 54 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. భగత్ సింగ్ కాలనీ వాసుల కల సాకారం చేశారని ధన్యవాదాలు తెలిపారు. 1400 కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు త్వరలో అందుకోబోతున్నారని చెప్పారు. మూతపడ్డ వీఆర్సీ హైస్కూల్‌పై మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్సీ సిద్ధమవుతుందని తెలియజేశారు. పేద పిల్లలకు కార్పొరేట్ చదువులను ఉచితంగా అందించాలన్నది నారాయణ సార్ సంకల్పం అని చెప్పారు. అభివృద్ధి అంటే నారాయణ అనేలా మంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. మంత్రి నారాయణ సార్ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ తాళ్ళపాక అనురాధ మాట్లాడుతూ చెప్పాడంటే చేస్తారు అనేందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. ఆర్థిక పరిస్థితి భాగాలేకపోయినా హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని అభినందించారు. 2014లోనే మంత్రిగా 5250 కోట్లతో నెల్లూరు సిటీని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి చేశారని చెప్పారు. మంచినీటి పథకాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల రూపకర్తగా ప్రజల మన్ననలు పొందారన్నారు. గత ప్రభుత్వం కక్షతో ఆపేసిన అభివృద్ధి పనులన్నీ మంత్రి పున:ప్రారంభించారని తెలిపారు. అన్నా క్యాంటీన్లు, ఏసీబస్ షెల్టర్లు తిరిగి మంత్రి నారాయణ పున:ప్రారంభించారన్నారు. ప్రజాభీష్టం మేరకు పనులు చేస్తున్న నేతా మంత్రి అని అభివర్ణించారు. నారాయణ సార్ మాటల మనిషి కాదు చేతల మనిషి అని స్పష్టం చేశారు. ఏడాదికి పది కోట్ల సొంత నిధిని కార్యకర్తల కోసం వెచ్చిస్తున్న మహోన్నత నేత నారాయణ సార్ అని కొనియాడారు. మంత్రి నారాయణ సార్ సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే కావడం మా అందరి అదృష్టమని హర్షం వ్యక్తం చేశారు. తదనంతరం నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు మాట్లాడుతూ రాక్షస పాలనను అంతమొందించి ఏడాది కాలం అయిందన్నారు. పారదర్శకతో సీఎం చంద్రబాబు పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. జగన్ జమానాలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలుగాడి తప్పాయని ఆగ్రహించారు. సీఎం అపార అనుభవంతో ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతోందన్నారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మంత్రి నారాయణ అని స్పష్టం చేశారు. హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండటంతో ప్రజాధరణ పెరుగుతోందన్నారు. టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీవిజేతారెడ్డి, డివిజన్ టీడీపీ ప్రెసిడెంట్లు, ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తహసీల్దార్‌ను సన్మానించిన డీలర్ సంఘం నేతలు



**కోవూరు, జూన్ 12ప్రభాతవార్త** : కోవూరు తహసీల్దార్‌గా సీహెచ్ సుబ్బయ్య బాధ్యతలు స్వీకరించడం విధితమే. ఈ మేరకు గురువారం కోవూరు మండలం డీలర్స్ సంఘం నేతలు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను పుష్పగుచ్ఛం , స్వీట్లు ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన బషీర్‌ను, సీనియర్ అసిస్టెంట్ రాకేష్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్యలను కూడా ఈ సందర్భంగా డీలర్స్ సంఘం నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల డీలర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

**వింజమూరు, జూన్ 12, ప్రభా తవార్త** అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం నందు చిన్నాఉలకు సామూ హిక అక్షరాభ్యాసం జరిపించారు. సీడీపీవో పద్మజాకుమారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్రీ స్కూల్ లో చేరిన నలుగురు చిన్నారులకు సామూహిక అక్షరా భ్యాసాన్ని జరిపించారు. మాట్లాడుతూ చిన్నారులకు ఫ్రీ స్కూల్ యొక్క ఆశ్యకతను తెలియజేశారు. అలాగే చిన్నారు లందరూ తప్పక విద్యను అభ్యసించాల్సిందిగా తెలిపారు. చిన్న వయసు లోనే పిల్లలకు అవసరమైన నైతిక పరమైన విలువలను దేశభక్తి విలువలను తెలియజేసి వారిని మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ఫ్రీ స్కూ ల్ ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, ఏసీడీపీఓ షర్మిష్టా, రాష్ట్ర ఎస్టీ కార్పొరేసన్ అధ్యక్షురాలు ఎన్.జయలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త పి.దీక్ష, అంగన్‌వాడీ సహాయకులు సీహెచ్ ప్రవీణ తల్లులు ఉన్నారు.



## జెడ్పీలో కారుణ్య నియామకాలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 12, ప్రభాత వార్త :** బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ జడ్పిటిసి సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహన్ రావుతో కలిసి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ఒకరికి టైపిస్ట్‌గా ఉత్తర్వులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడాది పాలన విజయోత్సవ ర్యాలీ

– రూరల్‌లో టిడిపి నాయకులు సంబరాలు పసుపుమాయంగా టిడిపి రూరల్ కార్యాలయం



**నెల్లూరు రూరల్, జూన్ 12, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్‌లో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నాయకత్వంలో టిడిపి నాయకులు కార్యకర్తలతో భారీ ర్యాలీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి సంక్షేమం అందుతూ సంతృప్తికరంగా ఉన్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు ఉంటే ప్రజాసేవకే అంకితం అవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి రాష్ట్ర వ్యాప్తంగా పరుగులు తీస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువయ్యాడు కార్యక్రమాలు చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరి ఎంతో ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆయన ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో భారీగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా దత్తాత్రేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట



**కోవూరు, జూన్ 12 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి బాబా మందిరం ప్రాంతంలో అత్తిచెట్టు కింద గురువారం దత్తాత్రేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల రెడ్డి, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ పచ్చి పాల మల్లికార్జునరెడ్డి, భక్తులు ఉన్నారు.

## యూరాలజీ వ్యాధులకు మెడికవర్ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు



**నెల్లూరు, జూన్ 12, ప్రభాతవార్త-వైద్యం :** యూరాలజీకి సంబంధించి మూత్రపిండాలు, మూత్ర నాళాలు, మూత్రాశయం, పురుషులలో వృషణాలు, ప్రొస్టేట్ గ్రంధి, శిశ్నం వంటి అవయవాల వ్యాధులకు నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ గోకుల్ నచికేత్ పేర్కొన్నారు. యూరాలజీకి సంబంధించిన వ్యాధులు, నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలపై డాక్టర్ గోకుల్ నచికేత్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మాట్లాడారు. యూరాలజీలో సమస్యల్లో కిడ్నీలో రాళ్లు కూడా పెద్ద సమస్యన్నారు. కిడ్నీలలో రాళ్లు ఏర్పడితే తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయని వాటిని మందులతో, లేజర్ కిరణాలతో కరిగించడం లేదా శస్త్ర చికిత్స ద్వారా తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లలో మూత్ర విసర్జన సమయంలో తీవ్రమైన మంట, నొప్పిని కలిగిస్తాయని చెప్పారు. పురుషులలో ప్రొస్టేట్ గ్రంధి పెరగడం లేదా ప్రొస్టేట్ గ్రంధికి క్యాన్సర్ సోకడం జరుగుతుందని ఈ సమస్యతో కూడా మూత్ర విసర్జనలో ఇబ్బందులకు దారి తీస్తాయని డాక్టర్ గోకుల్ నచికేత్ వెల్లడించారు. స్త్రీ, పురుషుల్లో మూత్రం ఆపుకోలేకపోవడం, మూత్రం లీక్ అవుతుండటం కూడా యూరాలజీ సమస్యగా గుర్తించాలన్నారు. పురుషులలో వంధత్వం, మూత్రాశయ క్యాన్సర్, మూత్ర పిండ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, వృషణాల క్యాన్సర్‌లు కూడా యూరాలజీ వ్యాధుల కిందే గుర్తిస్తామన్నారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో యూరాలజీ వ్యాధులు, సమస్యలకు అధునాతన చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. యూటీఐలు, ప్రొస్టేట్ సమస్యలు, ఇతర యూరాలజీ సమస్యలకు వైద్యులు మందులు సూచిస్తారని, మరికొన్ని సమస్యలకు శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. ఎండో యూరాలజీ ద్వారా మూత్ర పిండాల్లో రాళ్లను తొలగించడానికి, ప్రొస్టేట్ సమస్యలు, ఇతర యూరాలజీ సమస్యలకు వైద్యులు మందులు సూచిస్తారని, మరికొన్ని సమస్యలకు శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. ఎండో యూరాలజీ ద్వారా మూత్ర పిండాల్లో రాళ్లను తొలగించడానికి, ప్రొస్టేట్ సమస్యలకు చికిత్స చేయడానికి కెమెరా అమర్చిన సన్నని పరికరాను ఉపయోగించి ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. లాపోరోస్కోపీ ద్వారా కిడ్నీ తొలగింపు, ప్రొస్టేట్ తొలగింపు వంటి సంక్లిష్ట ఆపరేషన్లు చేస్తామన్నారు. అత్యంత ఖచ్చితత్వం, తక్కువ నొప్పి, వేగంగా కోలుకునే విధంగా తమ యూరాలజీ వైద్య బృందం వైద్య సేవలను అందిస్తుందని డాక్టర్ గోకుల్ నచికేత్ వెల్లడించారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో అన్ని రకాల వ్యాధులు, సమస్యలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉన్నారని, అనుభవజ్ఞులైన వైద్య బృందం, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని చెప్పారు. యూరాలజీ వ్యాధులు, సమస్యలతో బాధపడే వారు మెడికవర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## మహిళా కార్యకర్తలకు అండగా వేమిరెడ్డి

– సుగుణమ్మ భర్త మల్లిఖార్జున్ ఉత్తరక్రియలకు హాజరైన వీబీఆర్



**నెల్లూరు, జూన్ 12 ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని 14వ డివిజన్ టీడీపీ మహిళా టీం కార్యకర్త దొడ్డపనేని సుగుణమ్మ భర్త దొడ్డపనేని మల్లిఖార్జున్ గత నెల 29న అనారోగ్య కారణాలతో మరణించడంతో గురువారం జరిగిన ఉత్తర క్రియలకు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీ నగర్‌లోని సుగుణమ్మ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. మల్లిఖార్జున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లిఖార్జున్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో పార్టీ అండగా నిలుస్తుందని సుగుణమ్మకు ధైర్యం చెప్పారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉటుందని వేమిరెడ్డి భరోసా కల్పించారు. స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అశ్వవాహనంలో ఆదిశంకరుడు




**కోవూరు, జూన్ 12ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదా యబద్ధ ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఉభయకర్తలుగా కూన దశర థరామ్-కళ్యాణిదంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దివంగత పూనూరు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ధర్మపత్ని రమాదేవి, కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామివారు అశ్వ వాహనంలో కోవూరు పురవీధుల్లో ఊరేగారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చేవూరు కృష్ణప్రసాద్, ఉత్సవ నిర్మాణ కర్తలు మొలకల శ్రీనివాసులురెడ్డి, పోలుదాసు శ్రీహరి, గాదిరాజు చక్రవర్తి, భక్తులు ఉన్నారు.

## కమ్మవారిపల్లిలో అక్రమ ఖనిజం తవ్వకాలు

– జేసీబీని సీజ్ చేసిన పోలీసులు





**సైదాపురం, జూన్ 12, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురం పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామంలో గురువారం ఓ నిమ్మతోటలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి ఖనిజం వెలికితీస్తున్న జేసీబీని పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై కాంతికుమార్ వివరాల మేరకు కమ్మవారిపల్లి గ్రామంలోని పల్లేటి వెంకట రాజేశ్వరరావుకు సంబంధించిన నిమ్మతోటలో ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీ సహాయంతో తెల్లరాయి ఖనిజం వెలికి తీస్తున్నారన్న సమాచారంతో వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని ఖనిజం వెలికితీస్తున్న జేసీబీని తోట యజమాని పల్లేటి వెంకట రాజేశ్వరరావును జేసీబీ ఆపరేటర్ కృష్ణాపల్లి గ్రామానికి చెందిన గోపిదేసి శివాజిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన అన్నారు. మండలంలో ప్రభుత్వపట్టా భూముల్లో ఎవరైనా ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## చేజర్లలలో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం



**చేజర్ల జూన్ 12 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన చేజర్లలలో పలు కాలనీలలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు కొనసాగిస్తున్నా పారిశుద్యంపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ సెంటర్‌లో చెత్తా చెదారం రోడ్లపైన దర్శన మిస్తుండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలి అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రమైన చేజర్లలలో అన్ని కాలనీలలో పారిశుద్ధ్యంపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఏపిపి మాల్యాద్రికి ఘన సన్మానం



**కోవూరు జూన్ 12 ప్రభాతవార్త :** కోవూరులోని మెజిస్ట్రేట్ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తు పదోన్నతిపై నెల్లూరుకి బదలీ అయిన మాల్యాద్రిని గురువారం స్థానిక మేజిస్టేట్ కోర్టులో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శివ సమత్రా మాట్లాడుతు ఏపిపి మాల్యాద్రి బాధితులు పక్షాన సమర్ధవంతగా కేసు ల్ని నడిపించారని అన్నారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపి మాల్యాద్రి శక్తి వంచన లేకుండా కోర్టులో వాదించారని ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బార్ అసోసయేషన్ అద్యక్ష కార్యదర్శులు పి సునీల్‌కుమార్, సిహెచ్ చంద్రమోహన్, సీనియర్ న్యాయవాదులు సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, జి శ్యామాచార్యులు జక్కా శేషమ్మ, సిహెచ్ తిరుమలేష్ మడపర్తి రవీంద్ర పాల్గొని ప్రసంగించారు.

## సాయినాధునికి ప్రత్యేక పూజలునిర్వహించిన కాకాణి కుమార్తె



**మనుబలో జూన్ 12 ప్రభాతవార్త :** మనుబోలులోని సాయిబాబా మందిరంలో గురువా రం నాడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పూజా కార్యక్రమంలు నిర్వహించారు. ముందుగా అర్చకులు శ్రీనివాసులు ఆలయ సాంప్రదాయాలతో కాకాణి పూజితమ్మకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తన తండ్రి జైలునుండి కడిగిన ముత్యంలా తిరిగి రావాలని కేసులన్ని కొట్టి వేయాలని ఈ సందర్భంగా భగవంతుడ్ని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈకార్యక్రమానికి ఉభకయకర్తలుగా మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, సుప్రియ, వారి కుటుంబ సభ్యులు వ్యవహారించారు. మండల వైసిపినాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశ్నించే వారిని సంకెళ్ళు ఆపలేవు



**మనుబోలు జూన్12 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలులోని జాతీయర హదారి కూడలి వద్ద ఉన్న వైఎస్ రాజశేకర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితకి ముందుగా మండలంలోని వైఎస్ఆర్‌సిపి నాయకులు, మరియు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతు ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నా భయపడకుండా పార్టీ మాకుటుంబానికి అండగా నిలుస్తుందని అన్నారు. పార్టీ శ్రేణులకు , కార్యకర్తలకు రుణపడి ఉంటానని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కంచి పద్మమ్మ, ఎంపిపి వజ్రమ్మ, ఎంపిటిసి రాజేశ్వరమ్మ, వైసిపి మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల సాయి మోహన్‌రెడ్డి, దాసరి బాస్కర్‌గౌడ్, ముంగర రవీంద్రరెడ్డి, బుజ్జిరెడ్డి, ఆదినారాయణ, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, ఆవల తులసిరామ్‌యాదవ్ తదితరులు పాల్గోన్నారు.

## విమాన ప్రమాద ఘటనపై పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి



**నెల్లూరు రూరల్, జూన్ 12, ప్రభాతవార్త :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదంపై ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థించారు. ఈ ఘటనలో 20 మంది యువ డాక్టర్లు మరణించడం అత్యంత దురదృష్టకర మన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

## కన్నులపండుగగా సాగిన ఆత్మారాముని రథోత్సవం



**సంగం జూన్ 12 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని ఆత్మారాముని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆత్మారామస్వామి వారి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఈ రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విశ్వక్‌సేనపూజ, పుణ్యాహవచనం, వాస్తు హోమం, బలిహరణం తదితర పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు, ఉభయకర్తలు స్వామి వారిని రధదరుద్ను చేశారు. ఉదయం 11 గంటలకు స్వామి వారి రథం ఆలయం వద్ద నుండి బయలు



దేరింది. మొదట పడమటివీధికి వెళ్లి తరువాత తూర్పు వీధికి వచ్చింది. రథోత్సవ సమయంలో భక్తులు టెంకాయలు కొట్టి, రథం కింద గుమ్మడికాయలు వుంచి, మొక్కులు తీర్చుకున్నారు. యువకులు రంగులు చల్లుకుంటు జై శ్రీరామ్ అంటు రధాన్ని లాగారు. మధ్యహ్నం 1 గంట వరకు స్వామి వారి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. అలయ అర్చకులు వేదగిరి సత్యనారాయణాచార్యులు, వేదగిరి సూర్యనారాయణ చార్యులు, రాజ్‌కుమార్ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవ ఉభయకర్తలుగా దివంగత పులగం వెంకటశేషారెడ్డి, దివంగత పులగం దయాకర్‌రెడ్డి జ్ఞాపకార్దం కుమారుడు పులగం వెంకట్రామిరెడ్డి, పులగం కృష్ణారెడ్డి, మనిమాల మధుసూదన్‌రెడ్డి కుమారులు వ్యవహారించారు. రథోత్సవం ప్రారంభం నుండి ఎస్ఐ రాజేష్ పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించి ఆయన రథం బయలు దేరినప్పటి నుండి రథం ఆలయం వద్దకు వచ్చే వరకు రథాన్ని లాగారు. ఈకార్యక్రమంలో ప్రత్యేక వేషదారణలు అద్భుతంగా ఉన్నాయి. కార్యక్రమాలను ఆలయ ఇఒ వరప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## స్వామి ఆశీస్సులు ఆంధ్రప్రదేశ్ ప్రజలపై ఉండాలి



**కోవూరు, జూన్ 12ప్రభాతవార్త :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ఆ స్వామివారిని కోరుకోవడం జరిగిందని, ఏపీఈఎస్‌సీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. గురువారం తిరుమల వెంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో సహాదర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో పయనించేలా స్వామివారి ఆశీస్సులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మరింత స్థితి సామర్థ్యాలు ఇవ్వాలని కోరుకోవడం జరిగిందన్నారు. స్వామి దర్శన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతులు, దినేష్‌రెడ్డి సోదరి, వారి బావ, తదితరులు ఉన్నారు.

## కండలేరులో 37.688 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్13ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో గురు వారం ఉదయం నాటికి జలాశయంలో 37.688 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2480 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2590 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## అగ్రికల్చర్ ఏఓ ఏయస్ పేటకు బదిలీ



**కలిగిరి, జూన్12, ప్రభాతవార్త;** కలిగిరిమండలంలో మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ఏఓ సురేష్ ఏయస్ పేటకు బదిలీపై వెళ్లారు. ఏఓగా గత 6 సంవత్సరాలు మండలంలో పని చేసి మంచి అదికారిగా రైతుల తోనూ తోటి అధికారుల వద్ద పేరు తెచ్చుకున్నారు. ఈక్రమంలో ఏయస్‌పేటకు బదిలీపై వెళ్తున్న అధికారిని కొందరు సచివాలయ శిబ్బంది, రైతులు కలసి గురువారం ఏఓ కార్యాలయంలోఘనంగా సన్మానించారు. పూలమాలలతో శాలువాలతో శిబ్బంది తమ సంతోషాలను వ్యవసాయాధికారితో పంచుకున్నారు. కాగా ఏఓ సురేష్ మాట్లాడుతూ గత 6సంవత్సరాలుగా తనతో కలిసి పనిచేసిన శిబ్బందికి కీతజ్ఞతలు తెలియజేశారు. కాగా సురేష్ స్థానంలో జహీర్ అనే అధికారి కలిగిరికి వచ్చారు.

## బిసి కాలనీలో అంగన్వాడీ పిలుస్తోంది




**రాపూరు, జూన్13ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని కాపు వీధిలో వున్న బిసి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్వాడి పిలుస్తోంది కార్యక్రమం రాపూరు సెక్టార్ సూపర్‌వైజర్ బి. రాధికా ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మూడు సంవత్సరాల వయస్సు దాటిన పిల్లలను అంగన్‌వాడి కేంద్రానికి పంపాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటా, పాటలతో, కథలతో పదాలను నెర్పించడం జరుగుతుందన్నారు. ఇదే విదంగా మల్లమ్మగంట అంగన్‌వాడీ కేంద్రంలో కూడా అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం ర్యాలీని నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మల్లమ్మగుంట పభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శనమ్మ, ఆర్. శ్రీని వాసులు, హెచ్.జి మున్నీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీలా, ఎస్‌కె. షాభీరా, షేక్ ఆసిఫా, షేక్ మోహతాజ్, అమరావతి, అంగన్‌వాడీ సహాయకురాలు కవిత తదితరులు వున్నారు.

## రాజవోలులో అక్షరాభ్యాసం



**అనుమసముద్రంపేట, జూన్12, ప్రభాతవార్త:** మండలంలోని రాజవోలు అంగనవాడీ కేంద్రంలో గురువారం కార్యకర్తల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి. సునీలత ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు అలవాటు చేయాలని, చిన్నతనం నుండే అలవాటు చేస్తే విద్యపై మక్కువ పెరిగి డ్రాపవుట్స్‌ను నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట , పాటల ద్వారా విద్యను అందిస్తారని, వారి మానసిక పరిస్థితులకు అనుగుణంగా విద్యను అందిస్తారన్నారు. కావున అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు అలవాటు చేయాలన్నారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని చేశారు. అనంతరం చిన్నారులను దీవించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు కామాక్షమ్మ, మల్లీశ్వరి, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.